క్లుప్తంగా

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రకృతి ఉమా మహేష్

తాడిపత్రి అర్బన్: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రకృతి వనం ఫౌండేషన్ గ్లోబల్ చైర్మన్ ఉమామహేష్ పేర్కొన్నారు. స్థానిక శివాలయం వీధిలోని విఘ్నేశ్వర పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం భిన్నంగా ఆలోచించు అనే అంశంపై ప్రకృతి ఉమామహేష్ ప్రసంగించారు. ఒత్తిడి నుంచి బయటపడాలంటే నిరంతరం ధ్యానం చేయాలన్నారు. ఫలితంగా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ధ్యానంతో నాడీ వ్యవస్థకు మేలు కలుగుతుందన్నారు. ధ్యానం చేస్తున్న వారు చెడు అలవాట్లకు దూరంగా ఉండి జీవితంలో ఎన్నో విజయాలను సాధిస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు మారంరెడ్డి రంగనాథ్‌రెడ్డి, టంగుటూరు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

యల్లనూరు: ఉపాధిహామీ పథకం పనుల గుర్తింపు కోసం సోమవారం నుంచి అన్ని గ్రామాల్లోని గ్రామ సచివాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ షబ్బీర్‌బాషా తెలిపారు. అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామసభలు నిర్వహిస్తామని ఏపీఓ పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, ఆటోతో సెబ్ పోలీసులు

తాడిపత్రి అర్బన్: కర్ణాటకలోని పావగడ నుంచి తాడిపత్రికి తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తాడిపత్రి మండలం రావివెంకటాంపల్లి సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సెబ్ అధికారులు అనంతపురం నుంచి తాడిపత్రి వైపు వస్తున్న ఏపీ02 టిబి 2971 నంబరు గల ఆటోను తనిఖీ చేశారు. అందులో 145 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 8 ఓల్డ్ అడ్మిరల్ లీటర్ బాటిళ్లు పట్టుబడ్డాయి. నిందితుడు గన్నెవారిపల్లికి చెందిన అడవిరెడ్డి అరెస్టు చేసి మద్యం, ఆటోను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

నేడు ‘ఆలూరు’ రాక

యల్లనూరు: మండల కేంద్రానికి సోమవారం ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నేత చాంద్‌బాషా తెలిపారు. ముస్లింల హజ్ యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొంటారన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకు న్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. అనంతపురం వైపు వెళ్తున్న బైక్‌ను ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఘటనలో శ్రీనివాసులు, రామాంజనేయులు అనే వ్యక్తి గాయపడ్డారు. స్థానికులు వారిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాధితుడికి ఆర్థిక సాయం


మహబూబ్‌బాషా కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న దృశ్యం

తాడిపత్రి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్మికుడికి వెల్డింగ్ షాపుల యజమానులు అండగా నిలిచారు. ఆటో నగర్‌లో వెల్డింగ్ పని చేసే కార్మికుడు మహబూబ్‌బాషా రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. వెల్డింగ్ షాపుల యజమానులు జిలాన్ బాషా, యాసీన్ వలి, రహమతుల్లా సాధక్ వలి ఆదివారం మహబూబ్‌బాషా ఇంటికి చేరుకుని రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు.

గాంధీజీ స్ఫూర్తితో ముందుకెళదాం


బీకేఎస్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



తాడిపత్రి అర్బన్: వైఎస్సార్ సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రవి, సిబ్బంది


గుంతకల్లులో శ్రమదానం చేస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: స్వచ్ఛత విషయంలో జాతిపిత మహాత్మా గాంధీజీ స్ఫూర్తితో ముందుకెళదామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏక్ తారీఖ్, ఏక్ గంట కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్మికులను శాలువా, పూల మాలలతో సన్మానించారు. అనంతరం సిద్దరాంపురం రోడ్డు పక్కన ఎమ్మెల్యేతో పాటు ప్రజా ప్రతినిధులు చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగనన్న సాకారం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సంపూర్ణ పారిశుధ్యంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, ఎంపీడీఓ తేజోత్స్న, బీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, సీనియర్ నాయకులు ఆలూరి రమణారెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, వైస్ ఎంపీపీ రామగోపాల్, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, ముసలన్న, చేపల రమణ, కొండమ్మ, ముత్యాలశీన, నందినేని మల్లికార్జున సాకే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి పట్టణంలో విశేష స్పందన లభించింది. ఆదివారం ఏక్ తారీఖ్ ఏక్ గంటా శ్రమదాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని అన్ని శాఖల అధికారులు సిబ్బందితో కలిసి వివిధ ప్రాంతాల్లో శ్రమదానం చే శారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ కమిషనర్ జి.రవి ఆధ్వర్యంలో శానిటేషన్, ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, విద్యావేత్తలతో పాత మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక వైఎస్సార్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి ఆర్టీసి బస్టాండ్ వద్దకు చేరుకుని సరస్వతీ విద్యామందిర్, వివేకానంద ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రమదానం చేశారు. అక్కడి నుంచి తిరిగి వైఎస్సార్ సర్కిల్‌కు ర్యాలీగా చేరుకుని అక్కడ స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి వేణుగోపాల్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రీకాంత్, మెప్మా సీఓలు ఉమా, జిలాన్, కృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవలో తహసీల్దార్ మునివేలు, సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: మండల వ్యాప్తంగా ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, గ్రామ సర్పంచు అనూరాధా, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, మేజర్ పంచాయతీలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులు డంపింగ్ యార్డు వద్ద ఏపుగా పెరిగిన గడ్డి మొక్కలను తొలగించారు. రాయలచెరువులో వైస్ ఎంపీపీ హసీనాభేగం, గ్రామ సర్పంచు తలారీ అరుణ, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, సచివాలయ సిబ్బంద్ది, వలంటీర్లు, పారిశుధ్య కార్మికులు వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి నగేష్, జిలాన్ తదితరులు శ్రమదానం చేశారు. సర్పంచు తలారి అరుణ, కార్యదర్శి అరుణ్ కుమార్ చీపుర్లు చేతపట్టి పరిసరాలను శుభ్రం చేశారు.


యాడికి: రాయలచెరువులో చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేస్తున్న సర్పంచు అరుణ

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పలు ప్రాంతాల్లో రైల్వే డీజిల్ షెడ్ అధికారులు, కార్మికులు ఏపీఆర్ స్కూల్ విద్యార్థులు ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే డీజిల్ షెడ్, రైల్వే బుకింగ్ కార్యాలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటరమణ ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, స్టేషన్ మేనేజర్ సురేష్, సీనియర్ సెక్షన్ ఆఫీసర్ మనోజ్, విజయానంద్, డాక్టర్ విజయలక్ష్మి రైల్వే కార్మికులు రైల్వే యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శింగనమల: మండలకేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల వద్ద ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు ఉద్యోగులు కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల్లోనున్న పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంఈఓ నరసింహరాజు, ఈడీటీ రామకృష్ణ , పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాల ఆవరణలో చెత్తాచెదారంతోపాటు పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం స్వచ్ఛతకు మేము సైతం అంటూ మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య)ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓఆర్డీ కమలాబాయి, సర్పంచు ఓబులమ్మ, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, రామకోటి, పెద్దపప్పూరు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: స్థానిక కస్తూర్బా విద్యార్థినులు, పంచాయతీ సిబ్బంది స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ చెత్తకుండీలు ఉపయోగించాలన్నారు. చెత్తను రోడ్ల మీద పడేయకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాస్టిక్ నిషేధించాలన్నారు. సర్పంచు సుబ్బమ్మ, ఉప సర్పంచు షెక్షావలి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓ నాగసత్య, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ వరలక్ష్మీ, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ ఏకాంబరం ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చీపుర్లు చేతపట్టుకుని వీధులను శుభ్రం చేశారు. పంచాయితీ కార్యదర్శులు మురళీకృష్ణారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో సిబ్బంది స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజ్‌కుమార్, ఏఈ మంజునాథ్ ఆదివారం కార్యాలయ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేటీఓ మనోహర్ ఉన్నారు.

తాడిపత్రి: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా తహసీల్దార్ మునివేలు సిబ్బందితో కలిసి ఆదివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణాన్ని శుభ్రం చేశారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ సూచించారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా ఆదివారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు శ్రమదానం చేశారు.

యల్లనూరు: యల్లనూరు, వేములపల్లిలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవపై సర్పంచులు అశోక్‌కుమార్‌రెడ్డి, పెద్ద ఓబులమ్మ పారిశుధ్య కార్మికులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిమోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు యోగానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్నేహ, గీత, ఏపీఓ షబ్బీర్‌బాషా పాల్గొన్నారు.


గుత్తి ఆర్ఎస్‌లో రైల్వే డిజిల్ షెడ్ పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు, కార్మికులు


పెద్దపప్పూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


గార్లదిన్నెలో: రోడ్లు శుభ్రం చేస్తున్న పంచాయతీ అధికారులు

స్వచ్ఛ గుంతకల్లుగా తీర్చిదిద్దుకుందాం

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలు స్వచ్ఛ గుంతకల్లుగా తీర్చిదిద్దుకోవడానికి కంకణబద్ధులు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది చీపుర్లతో మెయిన్‌రోడ్డు గాంధీచౌక్‌లో చెత్తాచెదారాన్ని ఊడ్చేశారు. హౌసింగ్‌బోర్డు మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా ద్వారా మహాత్మా గాంధీకి ఘనమైన నివాళులర్పించవచ్చన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఎంఈ గురప్పయాదవ్, డీఈ రామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, మెప్మా టీపీఆర్ఓ మోహన్, వార్డు ఇన్‌ఛార్జ్ వీరేష్, సచివాలయం కన్వీనర్ హాజీ, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆర్టీసీ అధికారులు, సిబ్బంది స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారాన్ని ఊడ్చేశారు. కార్యక్రమంలో డీఎం నారాయణస్వామి, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గుంతకల్లు డిపో ఆధ్వర్యంలో ఆదివారం కసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆలయ పరిసరాలతోపాటు, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, పారిశుధ్యంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఐఓసీ అధికారులు విష్ణురామ్ దినేష్, ఐఓసీ లైజనింగ్ ఆఫీసర్ నజీర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నెలగొండ గ్రామంలో సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ఈసందర్భంగా పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులతో కలిసి గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ స్వయంగా వీధుల్లో చెత్తను శుభ్రం చేశారు.కార్యదర్శి రమేష్ నాయక్, నాయకులు పాటిల్ జయరామిరెడ్డి, శంకరప్ప, షబ్బీర్, సచివాలయ కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.

పామిడి: పామిడిలో ఈఓఆర్డీ బీవీ శశికళ, పాళ్యంలో సర్పంచ్ రామాంజనేయులు, ఎద్దులపల్లిలో సర్పంచ్ జీ వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ఈఓఆర్డీ, సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ జోజోడే కుమార్, సచివాలయాల పట్టణ కన్వీనర్ బీ ఆసిఫ్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి బీ రమణారెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దత్తు, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, వెంకట్రామిరెడ్డి చీపుర్లతో వీధులను శుభ్రం చేశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి పరిశుభ్రత మనందరి బాధ్యత అంటూ ప్రతిన బూనారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి


రికార్డులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమా

గుంతకల్లుటౌన్: పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచామని, వాటిని వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా తెలిపారు. ఆదివారం పట్టణంలోని వన్‌టౌన్ పీఎస్ వద్దనున్న ప్రభుత్వ ప్రథమశ్రేణి గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి దిన, వార, పక్ష, మాస పత్రికలు ఎన్ని తెప్పిస్తున్నారని గ్రంథాలయాధికారిని ఆరాతీశారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారికి ఇంకా ఏవైనా పుస్తకాలు అవసరమైతే తెలియజేయాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సహకారంతో పాతగుంతకల్లులో నిలిచిపోయిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేయించేందుకు చర్యలు చేపడుతామని ఆమె వెల్లడించారు. గ్రంథాలయాధికారి పి.కమ్మన్న, సహ గ్రంథాలయాధికారిణి హేమలత, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం.మోహన్ రెడ్డి ఉన్నారు.

గుత్తి: పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆదివారం సాయంత్రం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. ఈ గ్రంథాలయ పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారిని ఆదేశించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, గ్రంథాలయాధికారి రామాంజనేయులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

పెద్దవడుగూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు మండలంలోని జాతీయ రహదారులపై గుంతలను మట్టితో పూడ్చి వేశారు.

గుత్తి రూరల్: రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా సీఐ వెంకట్రామిరెడ్డి ఆదివారం గుంతల్లో మట్టి వేయించారు. గురుకుల పాఠశాల ఎదుట రేడియం స్టిక్కర్‌తో కూడిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు మహాలింగ ఉన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఘన సన్మానం


గుంతకల్లు రూరల్: వృద్ధులను సన్మానిస్తున్న ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి


శింగనమల: వృద్ధులను సన్మానిస్తున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ

గుంతకల్లు రూరల్: సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధ ఓటర్లను ఘనంగా సత్కరించారు. ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తహసీల్దార్ తెలిపారు.

యాడికి: మనిషి జీవితంలో ఎవ్వరికీ వృద్ధ్యాప్యం శాపం కాకూడదని యాడికి వీఆర్వో రమేష్ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో 80 ఏళ్లు పైబడిన వృద్ధులను వారు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల: సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా శింగనమలలో 80 సంవత్సరాలు పూర్తయిన ఓటర్లకు ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఈశ్వరమ్మ శాలువా కప్పి సన్మానించారు. వృద్ధుల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ హనుమాన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి ఆధ్వర్యంలో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ సిటిజన్లు కే నారాయణమూర్తి, సుంకమ్మను ఘనంగా సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మీనారాయణరెడ్డి, వీఆర్వోలు భాగ్య, సునితబాయి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి తమను ఆదరించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రజలను కోరారు. ఆదివారం నీలారెడ్డిపల్లి, కొర్రపాడులో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలసి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల నాయకులు పూలమాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోలోని అంశాలను 99 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అర్హులందరికీ కులమత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఎలాంటి అవినీతి లేకుండా ప్రజల గుమ్మం వద్దే పథకాలు అందిస్తున్నామని గుర్తు చేశారు. ఏదైనా కారణాల వల్ల సంక్షేమ పథకాలు రాకున్నా...వాటిని పరిశీలించమని, సచివాలయ సిబ్బందికి, మండల అధికారులను అక్కడికక్కడే పిలిచి ఆదేశాలు జారీ చేశారు. జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నాయకులు ఆలూరి రమణారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ రామగోపాల్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న, నియోజక వర్గం యువ నేత ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, రాధామనోహర్‌రెడ్డి, ఆగ్రోస్ రామకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, సర్పంచులు పార్వతి, శ్రీనివాసరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అక్కులప్ప, రమేష్‌రెడ్డి, సురేష్, రెడ్డప్ప, నాగేష్, కొత్తపల్లి నాగలింగారెడ్డి, పూల నారాయణస్వామి, నందినేని మల్లికార్జున, చికెన్ నారాయణస్వామి, ముత్యాలశీన పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం


యర్రగుంటపల్లిలో పర్యటిస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం యర్రగుంటపల్లిలో ఆయన పర్యటించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా స్థానికులు పలు సమస్యలు తెలియజేయగా వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కిశోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు సూర్యనారాయణబాబు, బాబు, నాగేశ్వర్‌రెడ్డి, రామాంజి, కృష్ణయ్య, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద చేపడుతున్న రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కౌన్సిలర్ రాబర్ట్, నాయకులు బాబా, గంగులకుంట కేశవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పప్పుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

పెద్దపప్పూరు: పప్పుశనగ కోసం రైతన్నలు ఈనెల 3 నుంచి ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని దేవుని ఉప్పలపాడు, చిన్నయక్కలూరు, తబ్జుల గ్రామాలు మినహా అన్ని గ్రామాల రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సబ్సిడీ పోను క్వింటాల్‌కు రూ.4,860 రైతులు చెల్లించాలని తెలిపారు. 20 కిలోల బ్యాగులు ఎకరానికి రెండు చొప్పున 5 ఎకరాలకు అందిస్తామని పేర్కొన్నారు.

పుట్లూరు: రబీలో పప్పుశనగ సాగు చేసే రైతులు సబ్సిడీ కింద విత్తనాల కోసం మంగళవారం నుంచి స్థానిక ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ కాత్యాయని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ పోనూ రైతులు క్వింటాల్‌కు రూ.4,860 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో రేపు స్పాట్ అడ్మిషన్లు

తాడిపత్రి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపడతామని పేర్కొన్నారు. వివరాలకు 9493773778 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కేసు నమోదు

నార్పల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులపై సోషల్‌మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ, నారాయణస్వామి సీఎం కుటుంబ సభ్యులతోపాటు మంత్రి రోజాను దూషిస్తూ పోస్టులు పెట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నరేంద్రరెడ్డి ఫిర్యాదు మేరకు వారిపై కేసులు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పుట్లూరు: గాండ్లపాడు వద్ద ఆదివారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఆటో డ్రైవర్ ఇమామ్‌కు గాయాలయ్యాయి. వివరాలు.. తాడిపత్రి టైలర్స్ కాలనీకి చెందిన ఇమామ్ యల్లనూరు నుంచి తాడిపత్రికి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రున్ని వెంటనే 108లో ఆసుపత్రికి తరలించారు.